'బృందావన్' లో 100శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: బందావన్ ఇంగ్లీష్ మీడియం సిబిఎస్ఇ 10వ తరగతి ఫలితాలలో ప్రారంభించిన మొదటి బ్యాచ్‌లో 100 శాతం ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగురవేసిన విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ శైలజకుమారి అభినందించారు. ఫలితాల్లో చరణ్ కుమార్ 95.2శాతం, లికిత 89, తేజశ్రీ 86.2, జీవన 85, గణేష్ 82, సాయి సంతోష్ 81, సారిక 81శాతం మార్కులు సాధించారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప ఫలితాలతో ముందుకెళ్తామని తెలిపారు.

అమూల్ అల్లేస్తోంది...

- తేలని కార్మికుల బకాయిల పరిస్థితి
- ఆగమేఘాలపై సాగుతున్న పనులు
- నిత్యం అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సహకార విజయ డెయిరీ కాస్తా అమూల్‌గా మారిపోనుంది.. రాష్ట్ర క్యాబినేట్ విజయ సహకార పాల డెయిరీ ఆస్తులు అమూల్‌కు కట్టబెడుతూ జీవోను పాస్ చేసింది. 99 సంవత్సరాలకు లీజుకు ఇవ్వనున్నట్లు కోఆపరేటివ్ అధికారులు చెబుతున్నారు.. దీంతో ఆగ మేఘాలపై అమూల్‌కు అప్పగించేందుకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో అత్యంత విలువైన చిత్తూరు - వేలూరు జాతీయ రహదారి జిల్లా కలెక్టరేట్‌కు సమీపంలోని 28 ఎకరాల భూమిని అమూల్‌కు కట్టబెటేందుకు జేసీబిలతో శుభ్రం చేస్తున్నారు. రోజుకో ప్రజాప్రతినిధులు, అధికారులు పనులు నిత్యం పరిశీలిస్తూనే ఉన్నారు. ఇదంతా చూస్తున్నా బయటి వ్యక్తులు ఎంతోకాలం తరువాత ప్రజాప్రతినిధులు, అధికారుల అత్యుత్సాహం ఏమిటని ముక్కున వేలేసుకుంటున్నారు.

1945లో చిత్తూరు- వేలూరు జాతీయ రహదారిలో 28 ఎకరాల్లో పాడి రైతుల సహకారంతో 3వేల లీటర్ల పాలసేకరణతో చిత్తూరు విజయ సహకార డెయిరీ ప్రారంభమైంది. అచలంచెలుగా ఎదుగుతూ జిల్లాలోని పాడి రైతులకు అండగా నిలిస్తూ 1980 -90 మధ్య 3 లక్షల లీటర్ల పాలు సేకరించి దేశంలో అతిపెద్ద రెండో సహకార డెయిరీగా అభివృద్ధి చెందింది. విజయ డెయిరీ పేరు దేశంలో మారుమోగింది. పాల ఉత్పత్తులు తయారుచేసి దేశవిదేశాలకు ఎగుమతి చేసింది. నెయ్యి అమ్మకం ద్వారా టిటిడి నుంచి కోటి రూపాయలకుపైగా అమ్మకం జరిగేది. కోట్లాది రూపాయల టర్నోవర్‌తో లాభాల భాటలో పయనిస్తున్న విజయ సహకార డెయిరీకి జిల్లాలోని పాడిరైతులు 90శాతం పాలు పోసేవారు. నాడు 350 నుంచి 400మంది డెయిరీలో వివిధ కేటగిరిల్లో పని చేసేవారు. డెయిరీ పాలకవర్గం అవకతవకలకు నాటి ప్రభుత్వ నిరాధరణతో 2002 ఆగస్టులో సహకార విజయ డెయిరీ మూతపడింది.


సహకార విజయ డెయిరీ

డెయిరీలో పనిచేస్తున్న వందలాంది మంది కార్మికుల్లో 150 మంది నాటి నుండీ విజయ డెయిరీని తెరిపించాలంటూ విఆర్ఎస్ తీసుకోకుండా పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. వీరికి అండగా పాడి రైతుల సంఘాలు నిలబడితే డెయిరీ కోసం పెనుమూరుకు చెందిన రైతు వెంకటాచలం నాయుడు ఒంటిపై ఉన్న చొక్కా.. కాళ్ళకున్న చెప్పులు వదిలి నాటి నుండీ నేటి సుదీర్ఘకాలం పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. కోట్లాది రూపాయలు విలువ చేస్తే డెయిరీ ఆస్తులను అమూల్‌కు అప్పగించిన ప్రభుత్వం డెయిరీలో భాగస్వాములుగా ఉన్న పాడిరైతులు అభిప్రాయం తీసుకోకపోవడం పట్ల పాడిరైతులు ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుల జీతాల పరిస్థితి ఏమిటి...

అమూల్‌కు అప్పగించారు.. సరే ఏనాటికైనా విజయ డెయిరీని తెరుస్తారని విఆర్ఎస్ తీసుకోకుండా పోరాడిన 150 మంది కార్మికుల్లో కొందరు కాలంచేస్తే ప్రస్తుతం వంద మందికి పైగా కార్మికులు ఏనాటికైనా చట్టపరం తమకు అందాల్సిన వేతన బకాయిలు అందుతాయని ఎదురు చూస్తున్నారు. విజయ డెయిరీ ఎదుట చిన్నపాటి అలికిడైనా అక్కడికి చేరుకొని జీతాల బకాయిలపై అధికారులు, ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తున్నారు. టిటిడి తీసుకుంటుంది... ప్రభుత్వమే పునఃప్రారంభిస్తుదంటూ అమూల్‌కు అప్పగించడంపై కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పనులు పర్యవేక్షిస్తున్న ఎంఎల్ఏ, నగర మేయర్, కోఆపరేటివ్ అధికారిణి

బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్‌ఫొటో)

శరవేగంగా అప్పగింత పనులు..

అమూల్‌కు విజయ డెయిరీ ఆస్తులను అప్పగించేందుకు 28ఎకరాల విజయ డెయిరీ ఆవరణంలో ఏపుగా పెరిగిన మొక్కలను శుభ్రంచేసే పనిలో కోఆపరేటివ్ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ పనులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, వ్యవసాయశాఖ అధికారులు, కోఆపరేటివ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విజయ డెయిరీ ఆస్తులను అమూల్‌కు అప్పగించేందుకు శరవేగంగా పనులు చేస్తున్న అధికారులు కార్మికుల జీతాల బకాయిల విజయం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పెండింగ్ జీతాలు ఎవ్వరు చెల్లిస్తారనే విషయం అటు అధికారులు, ఇటు ప్రభుత్వం తెచ్చకపోవడంతో 21 సంవత్సరాలుగా జీతాల బకాయిల కోసం ఎదురు చూస్తున్న కార్మికుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. అమూల్‌కు ఎన్ని సంవత్సరాలు లీజుకు ఇచ్చారు, సహకార విజయ డెయిరీలో భాగస్వాములగా ఉన్న పాడి రైతుల పరిస్థితి ఏమిటి, కార్మికుల జీతం బకాయిల పరిస్థితెమిటి అనే విషయాలను తెచ్చాలని కోరుతున్నారు. ప్రస్తుతానికి ఏమి చెప్పలేమంటూ కోఆపరేటివ్ జిల్లా అధికారి వనజ సమాధానం ఇస్తున్నారు.

ప్రజాతంత్ర హక్కుల్ని కాపాడుకుందాం..!

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

అమరజీవులకు నివాళి అర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి- పలమనేరు: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన లౌకికవాదం, ప్రజాస్వామ్యం, ప్రశ్నించేతత్వం వంటి ప్రజాతంత్ర హక్కుల్ని, మౌలిక విలువలను కాపాడుకునే విధంగా ఉపాధ్యాయులు సమాజాన్ని ప్రభావితం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు ఉపాధ్యాయులను కోరారు. పలమనేరులో నూతన యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయాన్ని శనివారం వెంకటేశ్వర్లు ప్రారంభించారు. అమర జీవులైన చెన్నుపాటి లక్ష్మయ్య, దాచురి రామిరెడ్డి, అప్పారి వెంకటస్వామికి నివాళులు అర్పించారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 2004 నుంచి అమలు అవుతున్న సిపిఎస్ విధానాన్ని రద్దు చేసే దాని కోసం, 2013లో చేసిన పీఎఫ్ఆర్డిఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సిపిఎస్ రద్దు విషయంపై రాజకీయ పార్టీలు ఎన్నికలకు ముందు ఒక రకంగా, అధికారంలోకి వచ్చిన తర్వాత మరొక రకంగా వ్యవహరించడాన్ని తప్పుబట్టారు. రాబోయే ఎన్నికల్లో సిపిఎస్‌పై ఒక స్పష్టమైన విధానాన్ని రాజకీయ పార్టీలు ప్రకటించాలని, ఆంధ్రప్రదేశ్‌లో సిపిఎస్ రద్దు కోసం జరిగిన పోరాటంలో పెట్టిన అక్రమ కేసులు వెంటనే రద్దు చేయాలని కోరారు. పాఠ్యపుస్తకాల చరిత్రలో శాస్త్రీయమైన అంశాలను తొలగించి, అశాస్త్రీయమైన అంశాన్ని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వాలు ప్రయత్నం చేయడం సరికాదని, వాస్తవ చరిత్రను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా దేశ సార్వభౌమత్వాన్ని కాపాడే పౌరులుగా తయారు చేసుకోవాలని తెలిపారు. యూటీఎఫ్ కార్యాలయం ఉద్యమ కేంద్రంగా రూపొందించాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి టి. రఘుపతి రెడ్డి మాట్లాడుతూ ఈ వేసవి సెలవులు ముగిసే లోపు బదిలీలు, ప్రమోషన్ నిర్వహించాలని కోరారు. ఒక ఇంక్రిమెంట్ మాత్రమే ఇస్తూ ప్లస్ టు పాఠశాలలో చేసే ప్రమోషన్లను స్థానంలో పర్మినెంట్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్ నాయుడు, జివి రమణ, మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగా అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి, ఉద్యమస్ఫూర్తికి, సంఘ నిర్మాణానికి, సంఘటిత ప్రయోజనాలకు కేంద్రబిందువుగా యుటిఎఫ్ పలమనేరు డివిజన్ కార్యాలయం పనిచేయాలి అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిపి ప్రకాష్, దీనావతి, జిల్లా కోశాధికారి ప్రసన్న కుమార్, జిల్లా కార్యదర్శులు కృష్ణమూర్తి, ఏకాంబరం, మణిగండన్, ఐక్య ఉపాధ్యాయ కన్వీనర్ రమణ, ప్రజా సంఘాల నాయకులు ఓబుల్ రాజు, కుమార్ స్వామిరెడ్డి, మునిరాజా, తదితరులు పాల్గొన్నారు

మెప్మా ఆధ్వర్యంలో చిన్నారికి సాయం


ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న మైనారిటీ ఉద్యోగులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మైనారిటీ ఎంప్లాయిస్ ప్రొఫెషనల్స్ మర్చెంట్స్ అసోసియేషన్ (మెప్మా) ఆధ్వర్యంలో శనివారం చిన్నారి రుక్సానాకు గుండెకు దాతృత్వం చేశారు. మెప్మా ఛైర్మన్ ఎహసానుల్లా ఆధ్వర్యంలో చిత్తూరు జైహిద్ పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ అల్తాఫ్ చేతులు మీదుగా రూ.30వేలు నగదును అందజేశారు. యాదమరి మండలం, చిన్నరెడ్డిపల్లి ముస్లింవాడలో నివాసముంటున్న చిన్నారి రుక్సానాకు గుండెలో రంధ్రం ఉందని దీనికి లక్షలాది రూపాయలు ఖర్చు అవుతుందనీ వైద్యులు తెలిపారు. దీనికి స్పందించిన మెప్మా స్వచ్ఛంద సంస్థ దాతల సహకారంతో విరాళాన్ని సేకరించి వారి కుటుంబ సభ్యులకు ఇవ్వడం జరిగింది. మెప్మా అధ్యక్షులు బషీర్ అహమద్ మాట్లాడుతూ పేదలపట్ల దాతత్వం చేయడం చాలా సంతోషం కలిగించిందని తెలిపారు. మెప్మా సభ్యులు మునీర్, రసూల్ సాహెబ్, ముక్తార్, రఫీ, గౌస్, గిద్దుభాయ్, బాలసుబ్రమణ్యం, వేణు, హనీఫ్ పాల్గొన్నారు.

సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యం

లోక్ అదాలత్ కేసులు విచారిస్తున్న న్యాయమూర్తులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సమన్యాయం, సత్వర న్యాయం, పేదలకు ఉచితంగా అందించడమే లోక్‌అదాలత్ ఉద్దేశ్యమని చిత్తూరు జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎస్.రమేష్ తెలిపారు. శనివారం నూతన కోర్టు భవనంలో మెగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి రమేష్ మాట్లాడుతూ గతంలో నిర్వహించిన లోక్‌అదాలత్‌ల ద్వారా కేసులు పరిష్కారించడంలో జిల్లాకు మంచి పేరు ఉందని, రెండో విడత కార్యక్రమంలో కూడా అదే విధంగా కేసులు పరిష్కరించి జిల్లాకు మంచి ప్రతిష్టను సంపాదించేందుకు కషిచేయాలని రెవెన్యూ, పోలీసు, న్యాయవాదులను కోరారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందన్న విషయాన్ని కక్షిదారులు గుర్తించాలని, ఆర్థిక ఇబ్బందులతో న్యాయవాదులను సమకూర్చుకోలేని వారికి ఉచితంగా న్యాయవాదులను కేటాయించడం జరుగుతుందని తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా వచ్చిన తీర్పుకు అప్పీలు ఉండదని, ఇరు కక్షిదారులకు సమన్యాయం సకాలంలో అందించడం జరుగుతుందని, లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ ఐ.కరుణ కుమార్ మాట్లాడుతూ జిల్లా కోర్టు, 13 మండల లీగల్ సర్వీసెస్ కమిటీలలో 2వ జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు. అలాగే సైబర్ నేరాలను అరికట్టడానికి అవసరమైన అవగాహన కార్యక్రమాల కొరకు స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. చిత్తూరు ఆర్‌డిఓ రేణుక మాట్లాడుతూ మండలాల్లో గల కేసుల వివరాలను తహశీల్దార్ల ద్వారా తెలుసుకుని కక్షిదారులు సంతప్తి చెందేలా వారిని లోక్‌అదాలత్ తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. డిఎస్‌పి శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ క్షణికావేశంలో పెట్టిన కేసులను కక్షిదారుల పరస్పర అంగీకారంతో వారికి సత్వర న్యాయం అందించడంలో లోక్ అదాలత్ తోడ్పడు తుందని తెలిపారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షదారులు, అధికారులు పాల్గొన్నారు.

జిల్లా వికలాంగుల నూతన కమిటీ ఏకగ్రీవం

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పర్సన్ విత్ డిసేబులిటీ (పిడబ్ల్యుడి) ఫెడరేషన్ చిత్తూరు జిల్లా దివ్యాంగుల నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. చిత్తూరు జిల్లా కేంద్రంలో తపోవనం వద్ధాశ్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు మురళి ఆధ్వర్యంలో జరిగింది. ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్ర అధ్యక్షులు శంకర్రావు, స్పోక్‌మెన్ సుబ్రమణ్యం, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ రామరాజు, రాష్ట్ర ట్రెజరర్ కష్ణారావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ పిడబ్ల్యుడి ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అతిపెద్ద దివ్యాంగులకు సేవలు అందించే నెట్‌వర్కింగ్ వ్యవస్థగా తయారు చేయాలన్నారు. దివ్యాంగుల చట్టం 2016 అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో అధికారులకు అవగాహన కల్పించి దివ్యాంగుల చట్టాన్ని అన్ని విభాగం ఇంప్లిమెంటేషన్ అవ్వడానికి కషి చేయాలని అన్నారు. ప్రభుత్వ ఇచ్చే సంక్షేమ పథకాలను అర్హులైన దివ్యాంగులందరికీ అందే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. దివ్యాంగులకు ట్రైసైకిల్స్, వీల్ చైర్లు, చేతికర్రలు, చెవిటి మిషన్లు, బ్లైండ్ స్టిక్స్ అవసరమైన వారికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

ఏకగ్రీవమైన నూతన కమిటీ

జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎం.హరిబాబు, జిల్లా అధ్యక్షులుగా వి.శివకుమార్, ఉపాధ్యక్షులుగా చిన్న గుర్రప్ప, జిల్లా కార్యదర్శిగా పి.చిట్టిబాబు, జాయింట్‌సెక్రటరీగా మునిరాజు, కోశాధికారిగా కె.రాముడు, అధికార ప్రతినిధిగా వి.లీలాపతి నాయుడు, జిల్లా కమిటీ సభ్యులుగా మనీ, గజేంద్ర బాబు, పురుషోత్తం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రావు, కె.జయరామయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలుగా సి.కవిత, ఉపాధ్యక్షురాలుగా కాంచన, కార్యదర్శి సుబ్బమ్మలు ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన వారినిరాష్ట్ర నాయకులు అభినందించారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపిపై ఘనవిజయం సాధించడంతో కాంగ్రెస్ శ్రేణులు శనివారం సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు టిక్కీ రాయల్, జిల్లా నాయకులు బుల్లెట్ రవి నేతత్వంలో స్థానిక గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కర్ణాటక విజయంతో బిజెపి పతనం ప్రారంభమైందన్నారు. రాహుల్ గాంధీ నేతత్వంలో కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించిందన్నారు.

కర్ణాటక ఫలితాలతో బిజెపి పతనం ప్రారంభం: సిపిఐ

దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపిని రాష్ట్రంలో, దేశంలో ఎండగట్టేందుకు లౌకిక పార్టీలు ఏకతాటిపైకి రావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రామానాయుడు కోరారు. కర్ణాటక రాష్ట్రఎన్నికల ఫలితాలు నరేంద్ర మోడీ పతకానికి నాంది పలికాయని స్పష్టం చేశారు. త్వరలో జరగనున్న మరిన్ని రాష్ట్రాల ఎన్నికలలో బిజెపి అడ్రస్ గల్లంతు కావడం ఖాయమని చెప్పారు. సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్.నాగరాజు, గోపీనాథ్, మణి, సత్యమూర్తి, రఘు పాల్గొన్నారు

నగరి: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం పట్ల కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ అల్లాపిచ్చి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద వున్న టవర్ క్లాక్ వద్ద బాణాసంచా కాల్చారు. మిఠాయిలు పంపిణీ చేశారు. పిసిసి మెంబర్ నటరాజ మొదలియార్, బాబు, చిరంజీవి రెడ్డి, డీసీసీ సెక్రటరీలు ఢిల్లీ, దేశయ్య పాల్గొన్నారు.

కార్వేటినగరం: దేశంలోనే అతిపెద్ద పార్టీగా చెప్పుకుంటున్న భారతీయ జనతా పార్టీపై కర్ణాటక రాష్ట్రంలో శనివారం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్వేటినగరం గాండ్లమిట్ట కూడలిలో బాణసంచాలు పేల్చి, మిఠాయిలు తినిపించుకుని సంబరాలు చేసుకున్నారు. జిల్లా కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, దినకర్ ప్రసాద్, గౌతం, సుబ్బరాయులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: కర్ణాటక ఎన్నికల్లో ప్రజాతీర్పు బీజేపీకి చెంపపెట్టు అని పీసీసీ సభ్యులు పోటుగారి భాస్కర్ అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ కర్ణాటకలో కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య చిచ్చులు పెట్టి నెగ్గాలానే ప్రయత్నానికి కర్ణాటక ప్రజలు చెక్ పెట్టారని అన్నారు. మండల అధ్యక్షులు కందుకూరి హుమేష్, వి.జయచంద్రన్, మునికష్ణారెడ్డి, కిషోర్ పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పిసిసి కార్యదర్శి బి.జనార్ధన్ గౌడు అధ్యక్షతన స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో సంబరాలు చేసుకున్నారు. అనంతరం అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు భాస్కర్ గౌడ్, డిసిసి కార్యదర్శి రమణప్ప, బీసీ సెల్ అధ్యక్షులు రామప్ప, రామ్మూర్తి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఎన్ని'కల' జాతర

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రజా'దృష్టి'

తిరుపతి గంగజాతరకు రాయలసీమలోనే ఓ ప్రత్యేకత ఉంది. తెలంగాణలో సమ్మక్క-సారక్క జాతర ఎలాగో, తాతయ్యగుంట గంగమ్మ తిరునాళ్లు ప్రతి ఏటా వేడుకగా నిర్వహిస్తారు. కొన్ని శతాబ్దాల క్రితం తిరుపతి కుగ్రామంగా ఉన్న సమయంలో గ్రామ దేవతగా గంగమ్మ ఆవతరించిందని పురాణ గాథ. ఈమె స్వయాన తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారికి తోబుట్టువు. దాదాపు 500 సంవత్సరాల నుంచి తిరుపతి గంగమ్మజాతర నిర్వహిస్తున్నారు. ఈమెతో పాటు తాళ్లపాక పెద్దగంగమ్మ, వేషాలమ్మ, మారెమ్మ, ముత్యాలమ్మ, అంకాలమ్మ, నడివీధి గంగమ్మకు జాతర చేయడం ఆచారం. సాధారణంగా గంగమ్మ ఆలయానికి ప్రధాన ఆదాయం హుండీదే. అనంతరం వివిద సేవలు, అమ్మవారికి భక్తులు మొక్కుల రూపాన చెల్లించిన వస్త్రాలు, చెంబులు, వెండి, రాగి పాత్రలు తదితర వాటిని వేలం వేసి ఆ వచ్చిన సొమ్ముతో పాటు దాతలు ఇచ్చే డబ్బులతో ప్రతి ఏటా జాతర చేసేవారు. కానీ ఈ ఏడాది దానికి భిన్నంగా సాగుతోంది. హుండీ ఆదాయం, దాతలు సొమ్ము, వేలం ద్వారా వచ్చే నగదుకు అదనంగా అధిక సొమ్మును పోగు చేశారు. తిరుపతికి చెందిన అధికారపార్టీ శాసనసభ్యులు అమ్మవారికి గుడి పునర్నిర్మాణం చేయాలని తలిచి, అనుకున్నదే తడువుగా, టిటిడి, కార్పొరేషన్ సహకారంతో యుద్ధ ప్రతిపాదికన కేవలం నెలల వ్యవధిలోనే గుడిని పూర్తి చేశారు. అంతకు ముందు తిరుమల శ్రీవారి దర్శనార్థం తిరుపతికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మెప్పించి, ఒప్పించి తాతయ్యగుంట గంగమ్మ దర్శనం చేయించారు. తిరుపతి చరిత్రలో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రి అమ్మవారును దర్శించుకోవడం అదే ప్రథమం. ముఖ్యమంత్రి స్థానంలో అమ్మవారిని దర్శించుకున్న తొలివ్యక్తిగా జగన్మోహన్‌రెడ్డి నిలిచారు. ఇదంతా ఒక ప్రణాళిక ప్రకరమే జరిగిందన్నది తిరుపతి వాసుల అభిప్రాయం. తిరుపతి సమీప ప్రాంతంలో పుట్టి, తిరుపతిలోనే తన ఉన్నత విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి, ఇక్కడ నుంచే రాజకీయ అరంగ్రేటం చేసి, చివరకు తనతల్లిదండ్రుల చివర దశను సైతం తిరుపతిలోనే ఉండేలా చేసిన, 40సంవత్సరాల ఇండస్ట్రీగా సుపరిచితులు, 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పని చేసిన నారా చంద్రబాబు నాయుడు సైతం అధికారంలో ఉండగా ఈ గుడిపక్కకు కూడా తొంగి చూడకపోవడాన్ని అధికార పార్టీ అస్త్రంగా చేసుకుంది. అందుకే సిఎంస్థాయిలో జగన్‌ను ఆలయాన్ని రప్పించారు.

అనంతరం సిఎం తిరుపతి గంగజాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించారు. ఇక్కడ వరకు అంతా బాగానే ఉంది. ఆ తర్వాతే అసలు కథ ప్రారంభమైంది. తిరుపతి గంగమ్మను త్వరలో జరగబోవు ఎన్నికలకు ప్రచార ఆయుధంగా వాడుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంగజాతర రాష్ట్ర పండగ కావడంతో జాతర నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, తిరుపతి కార్పొరేషన్, తుడా, టిటిడి తలో ఓ చేయి వేసి నిధులను కేటాయించింది. దీంతో అంగరంగ వైభవంగా జాతర జరగాలని అందరూ బావించారు. దీన్ని అధికార పార్టీ సభ్యులు సొమ్ముచేసుకున్నారు. గంగ జాతరను ఎన్నికల ప్రచార జాతరగా మార్చేశారు. వాడ వాడల, వీధి వీధిన ఏప్రిల్ చివరి వారం నుంచే అమ్మవారి బ్యానర్లు, ఫ్లెక్సీలు, కటౌట్లు వెలిసాయి. వాటన్నిట్లో అమ్మవారితో పాటు స్థానిక శాసనసభ్యుడి ప్రిరూపం తప్పని సరి చేశారు. సాధారణంగా దేవుళ్ల తిరునాళ్లు, బ్రహ్మోత్సవాలు చేసేటప్పుడు దేవుళ్ల ఫోటోలు, ఆలయ చిత్రాలు వేయడం ఆనవాయితీ. ఈ సారి అందుకు భిన్నంగా ఎంఎల్ఏ ఫోటోతో కూడిన ఫ్లెక్సీలు, పోస్టర్లు తిరుపతి నగరమంతా వెలిశాయి. సుమారు 2 లక్షలకు పైగానే పోస్టర్లు వెలిసాయంటే అతిశయోక్తి కాదు. ఈ సొమ్మంతా ఆలయానిదే కావడం గమనార్హం. ఇది చాలదన్నట్టు అధికార పార్టీ నాయకులు మరో అడుగు ముందుకేసి ఇంటింటికి సారె, పసుపుకుంకమ పేరుతో మరో ప్రచారానికి తెరలేపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం ప్రముఖులు ఎస్‌ఫి, కలెక్టరు, జాయింట్ కలెక్టరు, కార్పొరేషన్ కమీషనర్, మేయరు, డిప్యూటీ మేయర్లు, మంత్రులు, ఇతర శాసనసభ్యులు, అధికారులు, ప్రముఖులు సారె యాత్ర చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ సారె ఊరేగింపులకు ఒక్క వీధి నుంచి 2 నుంచి 3 వేల మంది వచ్చేలా పథకం వేసి, దేవుడి పేరుతో ప్రచారానికి పూనుకున్నారు. పురాతన ఆచారాలు, సాంప్రదాయాలకు నిదర్శనమైన గంగ జాతరను అందుకు భిన్నంగా అధికార పార్టీ చేయడంపై స్థానికులే పెదవి విరుస్తున్నారు. ఇది గంగ జాతరా, అధికార పార్టీ ఎన్నికల జాతరా అంటూ బహిరంగంగానే విమర్శలు చేయడం గమనార్హం.

బీసీలకు అన్యాయం: మాజీ ఎంపీపీ

ప్రజాశక్తి-కుప్పం: రాష్ట్రంలో వెనుకబడిన కులాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని శనివారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాజీ ఎంపీపీ సాంబశివం శనివారం ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు స్థానిక సంస్థల కోటాలో 34 శాతం రిజర్వేషన్లు గత ప్రభుత్వంలో ఉండేదని, దీన్ని కుదించి 24 శాతం చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో 52 శాతం ఉన్న వెనుకబడిన కులాలకు జగన్ ఈ నాలుగు సంవత్సరాలలో ఊరగబెట్టింది ఏమిటని ఆయన సూటిగా ప్రశ్నించారు. వివిధ కులాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి ఎక్కడైనా వారికి కార్పొరేషన్‌లో రుణాలు, పనిముట్లు అందించారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అలంకరణ ప్రాయంగా కార్పొరేషన్లు ఉన్నాయే తప్ప ఆదుకునే విధంగా లేవని ఆయన ఎద్దేవ చేశారు. రాష్ట్ర వన్నెకుల సాధికార సమితి కన్వీనర్ రాజు మాట్లాడుతూ బీసీ కులాలకు రాష్ట్ర ప్రభుత్వం మొండిచేయి చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వన్నెకుల క్షత్రియ సాధికార సమితి వైస్ ప్రెసిడెంట్ కాణిపాకం వెంకటేష్, నాయకులు ఉదయ్ కుమార్, మురళి, శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

యువగళం అడ్డుకునేందుకే అనవసర జీవోలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: యువగళం పాదయాత్రను అడ్డుకునేందుకే జీఓ నెం.1 తీసుకొచ్చారని మండల తెలుగుదేశం అధ్యక్షులు జయప్రకాష్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జయప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను చేపడుతున్నదని, వాటిని ప్రశ్నించేందుకు ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు కూటమిగా ఏర్పడి పోరాటాలు చేస్తుండడం చూసి జీఓ నెం.1 తీసుకురావడం జరిగిందన్నారు. దీనిపై ప్రతిపక్ష, ప్రజా సంఘ పార్టీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా జీఓ నెం.1 ప్రజా వ్యతిరేకం అని హైకోర్టు తీర్పు ఇచ్చిందని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలో ఉన్న చట్టాలను కొనసాగించాలన్నారు. ఇకనైనా వైసీపీ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకుని రాజ్యాంగంలో పొందుపరిచిన సూచనలు, సలహాలు పాటించి రాష్ట్ర అభివద్ధికి పనిచేయాలన్నారు. ఉప సర్పంచ్ లోకనాథం నాయుడు, నాయకులు ధరణి, రమేష్, సూరి నాయుడు, రవి, జాకీర్ హుస్సేన్, రమణ, రాజమాణిక్యం, రాజేంద్రనాయుడు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-కుప్పం: ప్రతి రెండవ శనివారం లయన్స్ క్లబ్ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుంది. ఈ వైద్య శిబిరానికి మానవతా దక్పథంతో ముందుకొచ్చి మానవ సేవే మాధవ సేవగా భావించిన కుప్పం స్థానిక పిఇఎస్ ఆస్పత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరంలో పాల్గొన్న పేదవారికి ఉచిత వైద్య సేవలతో పాటు కంటి శస్త్ర చికిత్సలు చేస్తున్నట్టు లయన్స్ క్లబ్ అధ్యక్షులు ఎ.మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మాట్లాడుతూ ఈ వైద్య శిబిరానికి మేము సైతం అంటూ ముందుకొచ్చిన కుప్పం పిఇఎస్ ఆసుపత్రి వారికి ఆయన ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో దాదాపు వందకు పైగా పాల్గొని వైద్య సేవలను పొందినట్టు ఆయన తెలిపారు. అందులో 40 మందిని వైద్యులు శస్త్ర చికిత్సకు సిఫార్సు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కుప్పం లయన్స్ క్లబ్ ట్రెజరర్ సెంథిల్, క్లబ్ డైరెక్టర్స్ అజాద్, ప్రసాద్, శివ, మతిన్, పిఇఎస్ ఆసుపత్రి వైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల బూత్ కన్వీనర్‌గా యతేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండల జనసేన పార్టీ బూత్ కన్వీనర్‌గా మంచిరెడ్డి యతేశ్వర్ రెడ్డిని నియమించినట్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పొన్నా యుగంధర్ శనివారం మీడియాకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అనేది విలువ ఆధారిత రాజకీయ సంస్థ. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఆయన మండలంలో పార్టీ పటిష్టతకు ఎంతో కషి చేశారని ఆశ్రమను గుర్తించి అధిష్టానం ఈ పదవిని ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు. జనసేన పార్టీ ప్రతినిధిగా, ప్రజా జీవితంలో అత్యున్నత ప్రమాణాలను కాపాడుకోవాలి. ఆయన వెంట జనసేన సైనికులు ఉన్నారు.

ప్రతిభావంతులకు ప్రశంసాపత్రాలు

ప్రజాశక్తి-గంగవరం: తెలుగు సాహిత్య సాంస్కతిక సమితి అధ్యక్షులు తులసీనాథం నాయుడు నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు శనివారం బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు ఆయన తెలిపారు. గత నెల రోజులుగా ఈ శిక్షణ శిబిరంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని పుస్తక పఠనం, కథలు, నీతి పద్యాలు, సాంస్కతిక కార్యక్రమాలు, పలు అంశాలలో గెలుపొందారన్నారు.

వైఎస్సార్ వాహన యంత్రాల పంపిణీ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన వైఎస్సార్ యంత్రం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆలపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న మూగనపల్లిగ్రామంలో పవన్ కళ్యాణ్, గంగినాయనిపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న పిచ్చి గుండ్లపల్లి శంకర్ రెడ్డి, గడ్డురు సర్పంచ్ దేవేంద్ర గౌడ్, దాసర్లపల్లి ఎం హరినాథ్, పెద్ద చల్లారగుంట పంచాయతీ పరిధిలోని రెడ్డిజాలారిఇండ్లు గ్రామాల్లోని మంజునాథ, తీర్థం శ్రీనివాసులు, గొల్లచీమలపల్లి రామకష్ణారెడ్డి, వెంగంవారిపల్లి బి.రెడ్డప్ప, కమ్మనపల్లి బాలకష్ణ వీరికి వైఎస్సార్ యంత్రం కార్యక్రమంలో సబ్సిడీ పొందిన ట్రాక్టర్లను స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏవో మునికష్ణ ఆధ్వర్యంలో శనివారం ఎంపీపీ రెడ్డప్ప చేతుల మీదుగా వీరికి అందజేశారు. మండలం పరిధిలోని సర్పంచులు ఎంపీటీసీలు ఎస్ ఎస్ జి గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో మాజీ మంత్రి

ప్రజాశక్తి-పలమనేరు: పలమనేరు శ్రీ తిరుపతి గంగమ్మ జాతరను పురస్కరించుకొని స్థానిక మారెమ్మ, గంగమ్మ ఆలయాలలో మాజీ మంత్రివర్యులు అమరనాథ రెడ్డి శనివారం ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. సాంప్రదాయ ప్రకారం ప్రతి ఏడాది గంగమ్మ జాతరకు విచ్చేసి అమ్మవారికి పూజలు నిర్వహించేవారు. అయితే ఈ ఏడాది యువగళం కార్యక్రమం రేపటితో వందో రోజుకు చేరుకోనున్న తరుణంలో ఆ కార్యక్రమానికి హాజరు కావాల్సిన పరిస్థితి రావడంతో ముందస్తుగా ఆయన పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి ఈ పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు నియోజకవర్గ ప్రజలందరికీ గంగమ్మ జాతర శుభాకాంక్షలు తెలియజేశారు. జాతర సజావుగా సాగాలని, భక్తులకు నిర్వాహకులు అన్ని సౌకర్యాలను కల్పించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండేలా ఆ తల్లి చల్లని చూపు మనపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్‌బిసి కుట్టి, గిరిబాబు, ఖాజా, సుబ్రమణ్యం గౌడ్, నాగరాజు, మదన్, అములు, కోటేశ్వర్, రమేష్, వాసు, చిన్ని, గిరిధర్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు అవగాహన

ప్రజాశక్తి-పలమనేరు: ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఆర్డీఓ కార్యాలయంలో కుప్పం, గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం, వి.కోట, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం మండలాల రైతు భరోసా సిబ్బందికి మామిడి కోత సమయంలో అనుసరించవలసిన యాజమాన్య పద్ధతులపై జిల్లా ఉద్యాన అధికారి, డి.మధుసూదన రెడ్డి శనివారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన అధికారి మాట్లాడుతూ ఈ సంవత్సరం మామిడిలో పూత రెండు, మూడు దఫాలుగా రావడం జరిగిందని, దీంతో మామిడి కాయలు కూడా రెండు , మూడు దఫాలుగా పక్వానికి వస్తాయన్నారు. కాయలు కోసేటప్పుడు పక్వతను అనుసరించి ఒకేసారి కాకుండా రెండు, మూడు దఫాలుగా కోయాలని రైతులకు అవగాహన కల్పించాలని ఆర్‌బీకే సిబ్బందికి సూచించారు. ఒకే సారి రైతులందరూ కోయడంతో ఎక్కువ మొత్తంలో కాయలు మార్కెట్ లోకి వచ్చి, ధరలు తగ్గే అవకాముందని తెలిపారు. పూర్తిగా పక్వానికి వచ్చిన కాయలు కోయడంతో కాయల నాణ్యత, దిగుబడి పెరిగి మంచి ధరలు ఉండే అవకాశం ఉందని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి మురళి కష్ణ, ఉద్యాన సహాయ సంచాలకులు కోటేశ్వర రావు, ఉద్యాన అధికారులు లక్ష్మీ ప్రసూన, డింపు ప్రియ పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి మహాప్రభో..!

ప్రజాశక్తి-గుడిపల్లి: ద్రావిడ విశ్వవిద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగుల సమ్మె 16వ రోజు రెండవ శనివారం సెలవులో కూడా కొనసాగింది. ఉద్యోగులు అందరూ ఏకతాటిపైన నిలబడి అధికారులు, ప్రభుత్వం వెంటనే స్పందించి తమ ఆకలికేకలు తీర్చాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని, తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే తీర్చాలని నినాదాలు చేశారు. తమ ప్రధాన డిమాండ్ పెరిగిన జీతాలతో పాటు 12 నెలల అరియర్స్, ఉద్యోగ భద్ర కల్పించాలని కోరుకుంటూ నినాదాలు చేశారు. వర్సిటీ ప్రధాన ద్వారం వద్ద కొంతమంది విశ్వవిద్యాలయ అధికారులు ఈరోజు సెలవు కదా ఎందుకు సమ్మెలోకి వచ్చారు అంటే మా ఆకలి మాత్రం సమ్మె రోజైతే ఆగదు సార్ కాబట్టి సెలవు రోజు కూడా మా నిరసన తెలియజేయాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రాంతానికి వచ్చి, మా నిరసనలు తెలియజేస్తున్నాం. వెంటనే అధికారులు స్పందించి మా న్యాయమైన కోరికలను తీర్చాలని తెలియజేశారు. గత 16 రోజుల నుంచి తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా ఇటు అధికారులు గానీ అటు నాయకులు గానీ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

వేడుకగా వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శనివారం వేడుకగా ధ్వజారోహణం జరిగింది. ఉదయం ఐదు గంటలకు స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, అర్చన, నిత్యకైంకర్యాలు, అభిషేకం, పుణ్యాహవచనాలతో ప్రారంభించారు. తొలిగంటలో నైవేద్యం సమర్పించారు. 6 గంటలకు రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలుడు సర్వసైన్యాధ్యక్షుడు విశ్వక్సేనుడుతో కలిసి మాడవీధులలో ఊరేగింపునకు బయలుదేరారు. లోకకల్యాణానికి నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా జరగడానికి విశ్వక్సేనుడు అష్టదిక్పాలకులను ఆహ్వానించి ఆలయ మాఢవీదులలో నిర్వహించే కార్యక్రమాన్ని కంకణ భట్టాచార్యులు గోపాలచారి చేపట్టారు. అనంతరం 11 గంటల నుంచి 11.30 గంటల మధ్య కర్కాటక లగ్నంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు నడుమ గరుడాల్వార్ చిత్రపటమున్న వస్త్రంతో పాటు పూలమాలలను జోడించి ఆలయంలోని ధ్వజస్థంభానికి అధిరోహించారు. సాయంత్రం 5.30 నుంచి 6 గంటలకు మధ్య ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలుడిని పట్టు వస్త్ర సుగంధ భరిత పుష్పాలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చి వాహనంపై వేంచేసి ఆలయ ఆవరణంలోని ఊంజల్ మండపానికి చేరుకొని కనుల పండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. టీటీడీ ఆధ్వర్యంలో అన్నమాచార్య కళామందిర్ వారు నిర్వహించిన సంగీత కచ్చేరి భక్తులను ఎంతగానో ఆకట్టుకొంది. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, సూపరింటెండెంట్ రమేష్ బాబు, ఆలయ అధికారి సురేష్ కుమార్, నాగరాజు, కంకణభట్టు, నారాయణదాసరి, కిరణ్ భట్టార్యులు, సుందరవరదాచార్యులు పలువురు వేదపండితులు టీటీడీ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఏనుగుల నుంచి పంటలను కాపాడాలి

ప్రజాశక్తి-పలమనేరు: ఏనుగుల నుంచి పంటలను కాపాడుకోవడానికి ఎలిఫెంట్ క్యారిడార్ నిర్మాణాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓబుల రాజు, ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు ఉమాపతి నాయుడు వేరువేరుగా ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలమనేరు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఏనుగులు గత 30 సంవత్సరాలుగా గుంపులుగా వచ్చి అందులో కొన్ని అడవిసమీప ప్రాంతాలకు విడిపోయి కొన్ని ఏనుగులు మాత్రం పలమనేరు సమీపంలోని కౌండిణ్య అభయ అరణ్యములోను మొసలిమడుగు గ్రామ సమీపంలో వీటికి కావలసిన మేత నీరు పుష్కలంగా ఉన్న కారణంగా కొన్నేళ్లుగా ఇక్కడే స్థిరనివాస స్థావరాలను ఎంచుకున్నాయి. వీటి శాశ్వత పరిష్కారానికి అటు కేంద్రప్రభుత్వ సలహామేరకు ఇటు సరిహద్దు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తమిళనాడు మూడు రాష్ట్రాలు కలిసి ఏనుగులకు ఒక స్థిరమైన నివాస స్థావరాలు (ఎలిఫెంట్ క్యారిడార్) ఏర్పాటుకు ఇదివరకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుని ఉంటే ఇలాంటి పరిస్థితి జరిగేది కాదన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రతినిత్యం వార్తా పత్రికల ద్వారా ప్రచురిస్తూనేవున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. రైతులు పంటపెట్టుబడులకు రూ.లక్షలు అప్పులుచేసి వీటిపై ఆధారపడి జీవిస్తుంటే పంటలపై పగటిపూట వేలకొలది కోతుల బెడదలు, రాత్రి పూట ప్రతినిత్యం ఏనుగులు, అడవి పందులతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పంటలను కాపాడుకునేందుకు రాత్రిపూట పొలాలవద్ద ప్రాణాలకు తెగించి నిద్రలేని రాత్రులు గడుపుతూ ఏ సమయంలో ఎటువైపు వచ్చి ఏమి చేస్తాయోనని రైతులు భయాందోళనకు గురవుతున్నారన్నారు. పంటనష్టాలకు ప్రభుత్వం ఇచ్చే పరిహారం మాత్రం రూ.50 వేల పంటనష్టానికి పరిహారం రూ.వెయ్యి, రెండు, మూడువేలతో సరిపెడుతూ రైతుల కడుపుకొడుతున్నారన్నారు. పంటనష్టాలకు పక్కనున్న తమిళనాడు, కర్నాటక, కేరళ, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఇస్తున్న విధంగా ఇక్కడ రైతులకు కూడా ఇవ్వాలని రైతునాయకులు కోరుతున్నారు.

'అమ్మ'పై అద్భుత చిత్రం



ప్రజాశక్తి-యాదమరి: ఈ నెల14వ తేదీ మదర్స్ డే పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆర్ట్ మాస్టర్ కె.దామోదరాచారి అమ్మపై అద్భుతమైన చిత్రాలను రూపొందించారు.

మాతృదేవోభవ: సష్టికి విత్తు నిచ్చిన దాత. అమ్మ కామధేను, కల్ప తరువు, త్యాగానికి ప్రతీక. కాలజ్ఞాని అయిన మాత గర్భం నుంచి ఉద్భవించిన వారే. నవ మాసాలు మోసే భారమే కాదు, సమాజంలోని కామాంధుల రక్కసి కోరల్లో నుంచి రక్షించే బాధ్యత పెరిగింది.(ఆక్రిలిక్ రంగుల చిత్రం)

త్యాగ మూర్తి: తల్లి ఒడి దేశభక్తిని ప్రభోదించే బడి. మానవతా విలువలు పొదిగే కారా. తన కథల, కవితల, జోల పాటల తోటి శాంతి గీతం పాడించ గలదు, క్రాంతి పథంలో నడిపించ గలదు. ఒక బుద్ధుడు, ఛత్రపతి శివాజీ, గాంధీ అమ్మ పేగు తెంచుకొని భువికి వచ్చిన వారే. (నీటి రంగుల చిత్రం)

ఆదిశక్తి మాతృమూర్తి: ఆడబిడ్డ అని గిరాటెయ్యకుండా కంటికి రెప్పలా కాపాడే ఆదిశక్తి అమ్మ. సష్టిని సజీవంగా నిలిపే కరుణా మూర్తి. ప్రత్యామ్నాయం లేని ఒకే ఒక అమ్మ మన అమ్మ.(నీటి రంగుల చిత్రం)

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత | అటవీ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి-సోమల: పుడమి తల్లిని కాపాడి పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందని అటవీ శాఖ సిబ్బంది అన్నారు. శనివారం మండలంలోని కందూరు పంచాయతీ పగడాల వారి పల్లెలో, అన్నెమ్మ గారి పల్లి పంచాయతీలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్మెంట్(పర్యావరణ హిత జీవనశైలి) కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ సిబ్బంది గ్రామస్తులతో కలిసి పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ముఖ్యంగా నేటి సమాజంలో ప్లాస్టిక్ వాడకం ఎక్కువగా ఉందని దీన్ని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా ప్లాస్టిక్కు వాడడం నిలిపివేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడటం వల్ల మానవాళికి జంతువులకు తీవ్ర నష్టం కలుగుతోందని దీనివల్ల జంతువులకు మనుషులకు దీర్ఘకాలిక రోగాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని చేపట్టి అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ రమేష్ కుమార్, బీట్ ఆఫీసర్ శ్రీదేవి, చంద్రబాబు, బీట్ ఆఫీసర్ యుగంధర్, మునిరాజా,ఐ ఎస్ ఓ ధనుంజయ, అసిస్టెంట్ ఏబీవో వరదరాజులు రెడ్డి, గ్రామస్తులు రమేష్, మల్లికార్జున, హరి, దాసన్న, మునీంద్ర, కార్తీక్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పరామర్శ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలోని సాయి సుధా ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న వెదురుకుప్పం మండలం నచ్చుకూరు వైసీపీ నాయకుడు వెంకటముని కుమారుడు సురేష్‌ను డిప్యూటీ సీఎం నారాయణ స్వామి శనివారం ఆసుపత్రిలో పరామర్శించారు. అనంతరం డిప్యూటీ సీఎం వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం ఆరోగ్య శ్రీ కింద ఉచిత వైద్యం అందించాలని కోరారు. ఆయన వెంట జిడి నెల్లూరు నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ నారాయణరెడ్డి, వెదురుకుప్పం, ఎస్‌ఆర్ పురం జడ్పిటిసి సభ్యులు సుకుమార్, రమణప్రసాద్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు పద్మనాభ రెడ్డి ఉన్నారు.

అక్రమ మద్యం వ్యాపారాలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-కార్వేటినగరం: అక్రమ మద్యం వ్యాపారాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్ఐ భాస్కర్ తెలిపారు. శనివారం మేజర్ పంచాయతీ కార్వేటినగరం పెద్ద దళితవాడలో జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆదేశాల మేరకు అక్రమ మద్యం వ్యాపారాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత మత్తుపానీయాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్యంలోనే మద్యం, మత్తు పదార్థాలకు అలవాటు పడి బాల్యాన్ని వధా చేసుకోకూడదని అన్నారు. విద్యార్థులు, యువత దుర అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపై ప్రత్యేక దష్టి సారించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్ రవికుమార్, యువత పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి అని ప్రధానోపాధ్యాయులు లిల్లమ్మ అన్నారు. శనివారం మండలంలోని తుంబ కుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోగల గ్రామాల్లో బడిబాట కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని, పనికి వెళ్లరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న బడిబాట, జగనన్న వసతి దీవెన కార్యక్రమాలు ప్రారంభించి విద్యార్థులు విద్యావంతులు కావాలనే సంకల్పంతో పనిచేస్తుందన్నారు. గ్రామీణ ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, ప్రసూన, పిల్లల తల్లితండ్రులు పాల్గొన్నారు.

నూతన వీధిలైట్లు ఏర్పాటు

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని పాతూరునాత్తం గ్రామంలో ఇటీవల కూర్చున్న వర్షాలకు పురవీధులలో ఉన్న విద్యుత్ స్తంభాలలో వీధిలైట్లు మరమ్మతులకు నోచుకున్నాయి ఇది గమనించిన స్థానిక సర్పంచ్ రోజా శివ శంకర్ ప్రజలను దష్టిలో ఉంచుకొని రాత్రిపూట పురవిదులలో చీకటిగా ఉండటంతో సొంత ఖర్చులతో శనివారం కొత్త ఎల్ఈడి లైట్లు తెప్పించి విద్యుత్ సిబ్బంది సర్పంచ్ రోజా శివ శంకర్ దగ్గరుండి ప్రతి స్తంభానికి బల్బ్ అమర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ ఆచారి. సర్పంచ్ రోజా శివ శంకర్. సచివాలయ సిబ్బంది వార్డ్ వాలంటీర్లు లైన్మెన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసీపీలో చేరిన టీడీపీ నాయకులు

ప్రజాశక్తి-నగరి: రాష్ట్ర పర్యాటక, సాంస్కతిక వ్యవహారాల, యువజన సర్వీసులు, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కె రోజా సమక్షంలో నగరి మున్సిపాలిటీ కరకంతాపురం 17వ వార్డులోని టిడిపి ముఖ్య కార్యకర్తలు ఎండి కుప్ప స్వామి, త్యాగరాజ్, గుణశేఖర్, శ్రీనివాసన్, మోహన్, కుప్పయ్య, పి పాండియన్, రాజా, మరియు వినోద్ వీరితో 20 మంది వైఎస్‌ఆర్‌పి పార్టీలో శనివారం చేరారు. వారికి వైసీపీ కండువాలు కప్పి మంత్రి వైసీపీలోకి.ఆహ్వానించారు.ఈ సందర్భంగా వైసీపీలో చేరిన టీడీపీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చూసి వైసీపీలో చేరుతున్నట్లు మనోహర్ నాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగరి మున్సిపాలిటీ వైస్సార్సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్అదాలత్‌లో 279 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-నగరి: స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ జూనియర్ కోర్టులో శనివారం నిర్వహించిన నేషనల్ లోకాఅదాలత్‌లో పర్మనేట్ ఇన్జషన్ 02, డిక్లరేషన్ 01, మనీ 01, డీవీసీ 01, ఐపీసీ 16, ఆర్‌సీఎస్ 01, బ్యాంక్ పీఎస్‌పీ 28, ఫస్ట్ క్లాస్ అడ్మిషన్ 08, సెకండ్ క్లాస్ అడ్మిషన్ 221 కేసులు మొత్తం 279 కేసులు ఫస్ట్ అడిషనల్ సివిల్ జడ్జి సత్యకాంత్‌కుమార్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నెల్సన్‌లు పరిష్కరించగా రూ. మొత్తం 26,02,500 వసూలైంది. కార్యక్రమంలో ఏపీపీ రామశాంతి, డీఎస్‌పీ రవికుమార్ పాల్గొన్నారు.

అత్యాచార కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాశక్తి- పలమనేరు: బాలికకు మాయమాటలు చెప్పి లోబరుచుకొని ఎనిమిది నెలలు గర్భవతిని చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ చంద్రశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈనెల 10వ తేదీ రాత్రి నీళ్లకుంట గ్రామానికి చెందిన ఎం.శ్రీరాములు, భార్య కనక పోలీసు స్టేషన్‌లో ఆమె కూతురు (బాలిక) ని అదే గ్రామానికి చెందిన వరుసకు బాబాయ్ అయిన టి.నాగరాజు (29) మాయమాటలు చెప్పి లోబరుచుకొని ఎనిమిది నెలల గర్భవతిని చేశాడని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుపై సదరు నాగరాజుపై ఫోక్సో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా నింధితుడు నాగరాజు, అతని భార్య నాగలక్ష్మీ కోసం గాలిస్తుండగా 12వ తేదీ మధ్యాహ్నం పలమనేరు టౌన్, నాగమంగళం ఓవర్ బ్రిడ్జి సమీపంలో నిందితుడు నాగరాజు, అతని భార్య నాగలక్ష్మీ ఉన్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. దీంతో వెంటనే అక్కడికి పోలీసు సిబ్బంది వెళ్లి వారిద్దరినీ అరెస్టు చేసినట్లు తెలిపారు. అనంతరం విచారణలో నింధితుడు నాగరాజు బాలికను వాళ్ళ ఇంటికి పిలిపించుకొని మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడని, నాగరాజు భార్య నాగలక్ష్మి కూడా తన భర్తకు సహకరించి, ఆ బాలికను వాళ్ళ ఇంటికి తీసుకెళ్లి వారిద్దరినీ ఇంట్లో పెట్టి, అంగడికి పోతానని చెప్పి వెళ్లేదని, ఈ విధంగా నాగరాజు, బాలికతో శారీరకంగా కలిసి 8నెలలు గర్భవతిని చేసినాడని అంగీకరించాడు. ఈ విషయాలను ఎవరికైనా చెప్పితే బాలికను, ఆమె తల్లిదండ్రులను చంపేస్తానని బెదిరించడంతో బాలిక ఇన్ని రోజులు ఎవ్వరికీ చెప్పలేదని తెలిపారు. అనంతరం అరెస్టు చేసిన ముద్దాయిలను రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మాజీ జడ్పిటిసికి గాయాలు

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: రోడ్డు ప్రమాదంలో మాజీ జడ్పిటిసికి గాయాలైన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుండ్ల కట్టమంచి గ్రామం నుంచి మాజీ జడ్పిటిసి కళావతి, ఆమె కుమారుడు ధర్మేంద్ర ద్విచక్రవాహనంపై వ్యవసాయ పొలానికి వెళుతుండగా పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న బొలెరో వ్యాన్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో మాజీ జెడ్పిటిసికి, ఆమె కుమారునికి తీవ్ర గాయాలు కాగా, చిత్తూరులో ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన చికిత్స కోసం వేలూరు సిఎంసి తరలించినట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు పోలీసులు తెలిపారు.

పిల్లలపై తల్లిదండ్రులు నిఘా ఉంచాలి

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: ప్రమాదాలకు గురి కాకుండా పిల్లలపై తల్లితండ్రులు నిఘా ఉంచాలని ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పాఠశాలలకు సెలవులు కావడంతో పిల్లలు ఏం చేస్తున్నారు, ఎక్కడికి వెళ్తున్నారని గమనించడంతో పాటు ప్రస్తుతం ఎండ తీవ్రతను బట్టి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ మధ్య ఎంతోమంది పిల్లలు సరదాకు ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోయి కుటుంబానికి శోకాన్ని మిగిల్చారన్నారు. భవిష్యత్తు ఉన్న చిన్నారులు, యువకుల పై జాగ్రత్త వహించాలని కోరారు. ఎండలు విపరీతంగా ఉండడంతో సేద తీరడానికి కొంతమంది చెరువులు, బావులు, కాలవలు వాగులు, వంకల్లోకి వెళ్తుంటారని ఈత రాకపోయినా ప్రయోగాలు చేస్తుంటారని పేర్కొన్నారు. పిల్లలు అజాగ్రత్తగా ద్విచక్ర వాహనాలను అతివేగంగా నడుపుతూ ప్రమాదాలకు గురై, వాహనాలు నడిపే వయసు లేకున్నా వాహనాలలో ప్రయాణం చేయడం ప్రమాదకరం, చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు వారి పిల్లలకు అర్థమయ్యే విధంగా వివరించాలని పోలీసు శాఖ తరపున కోరుతున్నామని తెలిపారు.

తమలపాకుల తోట ధ్వంసం

ప్రజాశక్తి-పుంగనూరు: మండలంలోని మంగళం పంచాయతీ కంగా నెల్లూరు గ్రామానికి చెందిన కిరణ్ కుమార్ తమలపాకుల తోటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీనిపై ప్రముఖ వ్యాపారవేత్త రామచంద్ర యాదవ్ తమలపాకు తోటలు సందర్శించి శనివారం వారిని పరామర్శించారు. ఇటీవల మండల పర్యటనలో భాగంగా కంగా నెల్లూరు గ్రామ పర్యటనలో కిరణ్ కుమార్ ఇంటికి వెళ్లారు. ఈ విషయం ఆ గ్రామంలో కొంతమందికి నచ్చకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు తమలపాకు తోటను శుక్రవారం రాత్రి ధ్వంసం చేశారు. ఒక్క ఏడాదికి సుమారు రూ.5 లక్షల వరకు ఆదాయం వచ్చేదని అలాంటి తోటను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని ఆరోపించారు. తమలపాకు తోటను ధ్వంసం చేసిన వారిపై పోలీస్ కేసు నమోదు చేసి, వెంటనే అరెస్టు చేయాలని ఈ సందర్భంగా రామచంద్రయాదవ్ డిమాండ్ చేశారు.

పంట పొలాలపై కొనసాగుతున్న గజ దాడులు

ప్రజాశక్తి-సోమల: సదుం మండలంలోని పలు పంచాయతీల పరిధిలో ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడులు చేస్తూ రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయి. శనివారం వేకువ జామున జోగి వారి పల్లి పంచాయతీ బత్తల వారిపల్లి, మార్తూరి వారి పల్లి పరిసర ప్రాంతాల పంట పొలాలపై ఏనుగుల గుంపు దాడులు చేసి టమోటా, మామిడి, వరి పంటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. రైతులు తమ పంట పొలాలలో సాగునీటి కోసం ఏర్పాటు చేసుకున్న బిందు సేద్యం పరికరాలను పొలం చుట్టూ వేసుకున్న కంచెలను ధ్వంసం చేస్తున్నాయి. బాబు రెడ్డి, సుబ్రమణ్యం, మల్లికార్జున, లోకనాథ, రమేష్, రమణ, సుబ్రహ్మణ్యం తదితర రైతులకు చెందిన పొలాలపై దాడులు చేసి పంటలను నష్టం కలిగించినట్టు రైతులు తెలిపారు. వరి పైరు పై నడిచి తొక్కి వేయడం, మామిడి కొమ్మలు విరిచి వేయడం, కొబ్బరి చెట్లను విరిచివేయడం, పీవీసీ పైపులు ధ్వంసం చేయడం, టమోటా చెట్లను తొక్కి వేయడం చేస్తున్నాయని ఏనుగుల భారీ నుండి రైతులను పంట పొలాలను కాపాడాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు.